గిరిజన మహిళలకు వడ్డీలేని రుణాలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- భద్రాచలంలో ఐటీడీఏ పాలకమండలి సమావేశం

భద్రాచలం, ఫిబ్రవరి 18: ఆదివాసీ మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించి, సంఘాలను బలోపేతం చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు తగినన్ని నిధులు విడుదల చేస్తామని అన్నారు. మళ్లీ ఇందిర జలప్రభ పథకాన్ని అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఐటీడీఏ పాలక మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలంలో కరకట్ట నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు 'న్యాక్' ద్వారా శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మారుమూల గిరిజన గూడేల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక పాల్గొన్నారు.

ఆదివాసీ ఎమ్మెల్యే తెల్లంకు అవమానం

ఐటీడీఏ పాలక మండలి సమావేశంలో ఆదివాసీ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు అవమానం జరిగింది. సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కలెక్టర్, పీవో పాల్గొన్న సమావేశంలోనే ఆయనకు ప్రాధాన్యం కొరవడింది. సాధారణ వ్యక్తిగా సమావేశంలో పాల్గొనాల్సి వచ్చింది. ఆదివాసీల సమస్యలపై చర్చించేందుకు వేదికపైకి ఆహ్వానించలేదు. ఈ ఘటనను ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుంజా రమాదేవి తీవ్రంగా ఖండించారు.

1600 కోట్లకు స్కెచ్!

- నష్టానికి విక్రయించే యత్నం
- తక్కువ ధరకే వ్యాపారుల బిడ్
- అధికారుల తీరుపైనా అనుమానాలు
- గత టెండర్లు తెరవకుండానే రద్దు చేయడంపై సందేహాలు

ధాన్యం టెండర్లలో భారీ అవినీతి!

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): టెండర్ల పేరుతో అత్యంత విలువైన ధాన్యాన్ని అప్పనంగా అప్పగించే కుట్ర జరుగుతున్నదా? తెరవెనక భారీ అవినీతికి రంగం సిద్ధమైందా? ధాన్యం టెండర్ల విషయంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం కనిపిస్తున్నది. 2021-22 యాసంగి సీజన్‌కు సంబంధించిన సుమారు 35 లక్షల టన్నుల ధాన్యాన్ని గ్లోబల్ టెండర్లు పిలిచి వేలం ద్వారా విక్రయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణ ధాన్యాన్ని 3 లక్షల క్వింటాళ్ల చొప్పున 11 లాట్లుగా, 1.59 లక్షల టన్నుల సన్న ధాన్యాన్ని ఒక లాట్‌గా విభజించి గత నెల 25న నోటిఫికేషన్ జారీ చేసింది. టెండర్‌లో మొత్తం ఏడు కంపెనీలు పాల్గొని 12 లాట్లకు 30 బిడ్లు దాఖలు చేసినట్టు తెలిసింది. ఇందులో హాకా సంస్థ టెండర్లు రిజెక్ట్ కావడంతో 6 కంపెనీలకు చెందిన 26 బిడ్లు పోటీలో నిలిచాయి. సాధారణ ధాన్యానికి సగటున రూ. 1950, సన్నరకం ధాన్యానికి రూ. 2150 వరకు ధర కోట్ చేసినట్టు సమాచారం.

రూ. 1600 కోట్ల నష్టం

రైతుల నుంచి పౌరసరఫరాలశాఖ క్వింటాలుకు రూ. 2,040-రూ. 2,060 చొప్పున చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేసింది. సేకరించిన ధాన్యాన్ని దాదాపు 10 నెలలపాటు నిల్వ చేసింది. ఈ లెక్కన మొత్తం సొమ్ముకు వడ్డీ, స్టోరేజీ, ఇతర ఖర్చులు కలిపితే క్వింటాలు ధాన్యం ధర రూ. 2,400 నుంచి రూ. 2,500 వరకు ఉంటుందని అంచనా. కానీ, ఆయా కంపెనీలు కోట్ చేసిన ధరనుబట్టి చూస్తే క్వింటాలుకు రూ. 450 నుంచి రూ. 500 వరకు తక్కువగా ఉంది. క్వింటాలుకు సగటున రూ. 450ని పరిగణనలోకి తీసుకున్నా 35 లక్షల టన్నుల ధాన్యానికి మొత్తంగా రూ. 1600 కోట్ల వరకు నష్టం వచ్చే అవకాశం ఉంది. బహిరంగ మార్కెట్లో సన్న ధాన్యానికి పలుకుతున్న ధరతో పోల్చితే ఈ నష్టం మరింత పెరుగుతుంది.

రద్దు చేస్తారా? ముందుకెళ్తారా?

గత ప్రభుత్వంలో ధాన్యం వేలానికి టెండర్లు పిలిచినప్పుడు క్వింటాలుకు గరిష్ఠంగా రూ. 1,732 పలికింది. ఇలాగైతే నష్టం వస్తుందని భావించిన ప్రభుత్వం రూ. 2వేలకు పైగా ధర వస్తేనే విక్రయించాలని భావించి వాటిని రద్దుచేసింది. ఆ తర్వాత మళ్లీ టెండర్లు పిలిచినా ఎన్నికలు రావడంతో మధ్యలోనే ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ టెండర్లను రద్దుచేసి మళ్లీ పిలిచినా ఈసారి కూడా రూ. 2 వేల లోపే ధర పలికింది. బహిరంగ మార్కెట్లో సాధారణ ధాన్యం క్వింటాలుకు రూ. 2,200 నుంచి రూ. 2,300 ధర పలుకుతున్నది. కనీసం ఈ ధర వచ్చినా ప్రభుత్వానికి నష్టం ఉండదు. టెండర్‌లో దాఖలైన బిడ్ ప్రకారం ముందుకెళ్తే మాత్రం భారీ నష్టం తప్పదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందుకెళ్తుందా? వెనక్కి తగ్గుతుందా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

టెండర్ పక్రియపై అనుమానాలు

ధాన్యం టెండర్ ప్రక్రియలో కఠిన నిబంధనలు విధించడంతో అధికారుల వ్యవహారశైలిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టర్నోవర్ అంశంలో అగ్రికల్చర్ కమాడిటీస్, పెద్దమొత్తంలో లాట్స్ పెట్టడం వంటివాటి కారణంగా చాలామంది టెండర్‌లో పాల్గొనే అవకాశం కోల్పోయారు. గతంలో ఒక్కో లాట్‌కు 15 వేల టన్నులు కేటాయించడం వల్ల 70కిపైగా బిడ్లు దాఖలయ్యాయి. ఇప్పుడు ఒక్కోలాట్‌ను 3 లక్షల టన్నులకు పెంచడం వల్ల 26 బిడ్లు మాత్రమే దాఖలయ్యాయి. బిడ్స్ ఎక్కువ వస్తే వ్యాపారుల మధ్య పోటీ పెరిగి ఎక్కువ ధర వచ్చే అవకాశం ఉండేది. ఇప్పుడదని లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గత టెండర్లను ఎందుకు రద్దు చేశారు?

గత ప్రభుత్వం 25 లక్షల టన్నుల ధాన్యం వేలానికి రెండోసారి పిలిచిన తర్వాత ఎన్నికలు రావడం, కాంగ్రెస్ ఫిర్యాదు వంటి వాటితో ఆ ప్రక్రియను ఎన్నికల సంఘం నిలిపివేసింది. అప్పటికే టెండర్ దాఖలు, బిడ్స్ వేయడం కూడా పూర్తయింది. 70కిపైగా బిడ్స్ వచ్చాయి. ఆ తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని తెరిచి ఉంటే ఎంత ధరకు కోట్ చేశారో తెలిసి ఉండేది. ప్రభుత్వం ఆ ఆలోచనే మరిచి వాటిని ఏకపక్షంగా రద్దుచేసి కొత్తగా టెండర్లు పిలిచింది. టెండర్ల విషయంలో వ్యాపారుల మధ్య విభేదాలు తలెత్తడంతో వ్యాపారులు రెండు గ్రూపులుగా విడిపోయి టెండర్లు దాఖలు చేసినట్టు తెలిసింది. ఒక గ్రూప్ దాఖలు చేసిన టెండర్లు సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురికాగా, మిగిలిన గ్రూప్ రింగ్ చేసి ఏకపక్షంగా టెండర్లలో బిడ్లు దాఖలు చేసి వాటిని దక్కించుకునే ప్రణాళిక రచించినట్టు తెలిసింది.

నష్టం.. ఎవరికి లాభం

ఆయా కంపెనీలు కోట్ చేసిన ధర ప్రకారం ధాన్యం విక్రయిస్తే రూ. 1600 కోట్ల వరకు నష్టం వచ్చే అవకాశం ఉందని పౌరసరఫరాలశాఖ వర్గాలు తేల్చాయి. మరి ఈ నష్టం ఎవరికి లాభం చేకూర్చబోతున్నదన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశమైంది. ధాన్యం టెండర్ల విషయంలో వ్యాపారులు ముందస్తు వ్యూహంతోనే టెండర్లలో పాల్గొన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం 13 లాట్లకు 26 బిడ్లు మాత్రమే దాఖలు కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీ వ్యాపారులతో కలిసి హైదరాబాద్, వరంగల్ వ్యాపారులు కొందరు చక్రం తిప్పినట్టు తెలిసింది. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారి వీరందరినీ డీల్ చేస్తున్నట్టు సమాచారం. అందులో భాగంగానే ఒక్కో లాట్‌కు రెండు వేర్వేరు టెండర్లు దాఖలు చేసినట్టు చెప్తున్నారు. అందరూ కుమ్మక్కై బిడ్లు దాఖలు చేయడం వల్లే దాదాపు అన్నీ ధరకు దాఖలైనట్టు తెలిసింది.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న లాయర్స్ అసోషియేషన్ నాయకులు

హైకోర్టు తరలింపు తుగ్లక్ చర్య

వియ్ వాంట్ జస్టిస్

- రియల్టర్ల లబ్ధి కోసమే మార్పు
- విద్యార్థులు, రైతులు, న్యాయవాదులకు తీవ్ర నష్టం
- జీవో 55ను వెంటనే రద్దు చేయాలి
- కొత్త హైకోర్టుకు 1,000 కోట్ల ఖర్చు
- ఆ డబ్బుతో కింది స్థాయి కోర్టులను అభివృద్ధి చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో బార్ అసోసియేషన్లు, న్యాయవాద సంఘాల నాయకుల డిమాండ్

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 18: హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న హైకోర్టును నగరానికి దూరంగా ఉన్న ప్రేమావతి పేటకు (వ్యవసాయ వర్సిటీకి) తరలించడం అన్యాయమని రాష్ట్రంలోని పలు బార్ అసోసియేషన్లు, న్యాయవాద సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు తరలింపునకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని 'తుగ్లక్ చర్య'గా అభివర్ణిస్తూ.. జీవో 55ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల లబ్ధి కోసమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎవరినీ సంప్రదించకుండా హైకోర్టు తరలింపునకు ఏకపక్ష ఈ నిర్ణయం తీసుకున్నదని ధ్వజమెత్తారు. వ్యవసాయ, ఉద్యానవన వర్సిటీల భూములను బలవంతంగా లాక్కొని హైకోర్టు భవనాన్ని కట్టడం భావ్యం కాదని స్పష్టం చేశారు. దీని వల్ల వ్యవసాయ విద్యార్థులతోపాటు రైతులకూ తీవ్ర నష్టం జరుగుతుందని, బడుగు బలహీన వర్గాలకు చెందిన న్యాయవాదులు వృత్తికి దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మరో 100 ఏండ్ల వరకు ఉపయోగపడే చారిత్రక హైకోర్టు భవనాన్ని వదిలిపెట్టి కొత్త భవనాన్ని కట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. రేవంత్ సర్కారు తొందరపాటు చర్యను నిరసిస్తూ ఆదివారం వారు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. హైకోర్టు తరలింపునకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లు తీర్మానాలు చేయాలని, ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ న్యాయవాదులు ప్రత్యక్ష పోరాటానికి దిగాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ వర్సిటీ భూముల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. ప్రస్తుత హైకోర్టు వద్ద పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు మల్టీ-లెవల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. మూసీనదిపై వంతెనలు కట్టి, వాటిపై పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త హైకోర్టు భవన నిర్మాణానికి దాదాపు రూ.1,000 కోట్లు ఖర్చవుతుందని, ఆ డబ్బును కింది స్థాయి కోర్టుల అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. న్యాయవాద సంఘాల నాయకులు శారదాగౌడ్, మామిడి వేణుమాధవ్, శ్రీకర్‌రెడ్డి, భూక్యా రాజ్‌కుమార్, శ్రీజ, శంకర్‌నాయక్, మధుకర్, అరవింద్, వంశీధర్‌రెడ్డితోపాటు వివిధ కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.

సింహం దాడిలో మృతుడి మరో నిర్వాకం

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): తిరుపతి ఎస్వీ జూపార్కులో రాజస్థాన్‌కు చెందిన ప్రహ్లాద్ గుజ్జర్ మృతి ఘనటకు ముందు అతని మరో నిర్వాకం బట్టబయలైంది. జూపార్కుకు రాకమునుపు ప్రహ్లాద్ గుజ్జర్ తిరుపతిలోని హథీరాంజీ మఠానికి చెందిన వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లాడు. అక్కడి సిబ్బందితో గొడవపడి వారిపై దాడి చేశాడు. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ బయటకు వచ్చింది. ఆలయానికి వెళ్లిన గుజ్జర్ స్వామిదర్శనం కోసం నేరుగా క్యూలైన్లో వెళ్లాడు. దర్శనానికి టోకెన్ తీసుకోవాలని సిబ్బంది చెప్పడంతో వారితో గొడవపడ్డాడు. టోకెన్లు జారీచేసే యంత్రాలను మఠం సిబ్బందిపై విసిరేశాడు. చిన్నపాటి ఆయుధంతో తోటి భక్తులను, సిబ్బందిని బెదిరించాడు. దీంతో కొంత మంది ధైర్యం చేసి అతన్ని చుట్టుముట్టి బంధించారు. ఆపై పోలీసులకు సమాచారం అందించారు. ఆ సమయంలో అతను గంజాయి సేవించినట్టు అక్కడివారు గుర్తించారని సమాచారం. జూపార్కుకు వెళ్లిన ప్రహ్లాద్ ప్రమాద హెచ్చరికలను లెక్క చేయకుండా తాళం వేసి ఉన్న మొదటి గేటు ఎక్కి లోపలికి ప్రవేశించాడు. ఆ తర్వాత వాటర్ ట్యాంక్ మీదుగా సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకాడు. అక్కడే ఉన్న సింహం ప్రహ్లాద్ మెడ భాగంలో కొరికి అతన్ని చంపేసింది.

దోమలపెంట రేంజ్ పరిధిలో మంటలను ఆర్పుతున్న వాచర్లు

టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో కార్చిచ్చు

- రెండ్రోజులుగా కాలుతున్న అడవి

అమ్రాబాద్, ఫిబ్రవరి 18 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో గత నెలలో 50 హెక్టార్లలో అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. తాజాగా శనివారం రాత్రి దోమలపెంట రేంజ్ పరిధిలోని తాటిగుండాల, ఉప్పునుంతల సమీప అటవీ ప్రాంతం నుంచి కృష్ణానది సమీపంలోని వజ్రాల మడుగు వరకు రెండ్రోజులుగా కార్చిచ్చు రగులుకున్నది. దీంతో సుమారు 18 కిలోమీటర్లకు పైగా అడవి కాలడంతో మంటలను ఆర్పేందుకు సంబంధిత శాఖ ఎలాంటి ఫైర్ జాగ్రత్తలు లేకుండా తమను మంటల వద్దకు పంపుతున్నారని ఫైర్ వాచర్లు వాపోతున్నారు. భారీ ఎత్తున మంటలు చెలరేగుతుండటంతో చెంచు యువకుడు పోతయ్య కాలికి గాయమైందని వారు ఆరోపించారు. సరైన రక్షణతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వాచర్లు కోరుతున్నారు. ఆకురాల్చే సమయం కావడం, అడవి గుండా శ్రీశైలం రహదారి ఉండటంతో అటుగా వెళ్లే ఆకతాయిలు చేస్తున్న పనుల వల్ల మంటలు చెలరేగుతున్నాయని డీఎఫ్‌వో రోహిత్ గోపిడి తెలిపారు. రోడ్డుకిరువైపులా రాలి ఉన్న ఎండుటాకులను 20 మీటర్ల మేర తొలగించి కాలుస్తున్నామని పేర్కొన్నారు. ఫైర్ సిబ్బంది రక్షణ కోసం ఇనుప బూట్లు, ఎయిర్‌బ్లోర్స్, ప్రత్యేక మాస్కులు తదితర ఫైర్ సేఫ్టీ వస్తువులు అందజేశామని తెలిపారు.

మరో గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

- ఒకే పాఠశాలలో వారం వ్యవధిలో ఇద్దరు మృతి
- భయాందోళనలో పేరెంట్స్

అస్మిత (ఫైల్)

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 18 : సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పదోతరగతి విద్యార్థిని శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇటీవల అదే గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్ బైపీసీ రెండో సంవత్సరం విద్యార్థిని డీ వైష్ణవి కళాశాలలో ఫేర్వెల్ పార్టీ జరిగిన రాత్రే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువక ముందే తాజాగా ఈ ఘటన చోటుచేసుకున్నది. మోతె మండలం బురకచర్ల గ్రామానికి చెందిన ఇరుగు ఆనంద్-జ్యోతి దంపతుల కుమార్తె ఇరుగు అస్మిత (15) పదోతరగతి చదువుతున్నది. ఈ నెల 10న వైష్ణవి మృతి చెందడంతో విద్యార్థులు భయపడకుండా ఉండేందుకు పాఠశాల, కళాశాలకు 4 రోజులపాటు సెలవులు (హోం సిక్) ప్రకటించారు. అస్మిత తండ్రి చనిపోవడంతో తల్లి కూలి పనులు చేసుకుంటూ హైదరాబాద్‌లో ఉంటున్నది. పాఠశాలకు సెలవులు ప్రకటించడంతో అస్మిత తన తల్లి వద్దకు హైదరాబాద్ వెళ్లింది. శనివారంతో సెలవులు ముగియడంతో స్కూల్‌కు వెళ్లాలనుకున్నది. తన తల్లి పనికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకున్నది. వారం వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడటంతో పాఠశాల విద్యార్థులు, వారి కుటుంబాలు, బంధుమిత్రుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అస్మిత మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి సొంత గ్రామం బురకచర్లకు తీసుకొచ్చారు.

విచారణ చేపట్టాలి : ఎమ్మెల్సీ కవిత

ఇమాంపేట బాలికల గురుకుల పాఠశాలకు చెందిన చెందిన ఇద్దరు విద్యార్థినులు కొద్దికాలం వ్యవధిలోనే ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ట్విట్టర్ వేదిక ద్వారా స్పందించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో అసలు ఏం జరుగుతున్నది? విద్యార్థులు ఎందుకు ఇలా వరుస ఆత్మహత్యలు చేసుకుంటున్నారో ప్రభుత్వం విచారణ చేపట్టాలని కోరారు. పూర్తి స్థాయిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లేకపోవడంతో ఇలాంటి అనేక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేకపోతున్నదని పేర్కొన్నారు. పూర్తిస్థాయి సంక్షేమ శాఖ మంత్రి నియమించడంతోపాటు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

బడుగుల బిడ్డలకు రక్షణ లేదా?

- ఇద్దరు చనిపోయినా ప్రభుత్వం పట్టించుకోదా?
- సీఎం ఎందుకు స్పందించరు?
- చిన్నారుల ఆత్మహత్యలపై సీతక్క మాట్లాడాలి
- భవ్య, వైష్ణవి న్యాయ పోరాట కమిటీ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

సమావేశంలో తమ గోడును వెల్లబోసుకుంటున్న వైష్ణవి తండ్రి నాగరాజు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 18: చదువుకొని ప్రయోజకులు కావాల్సిన బడుగు బిడ్డలకు రాష్ట్రంలో రక్షణ లేదా? ఇద్దరు విద్యార్థినులు చనిపోయినా ప్రభుత్వం పట్టించుకోదా? అని పలువురు వక్తలు నిలదీశారు. రోడ్డుపై ఓ హోటల్‌ను నడుపుకొనే మహిళ కోసం స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇద్దరు బడుగు బిడ్డలు చనిపోతే మాత్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. భువనగిరి ఎస్సీ బాలికల వసతిగృహంలో ఉంటూ టెన్త్ చదివే భవ్య, వైష్ణవిపై పైశాచిక దాడి జరిగిందని, వారిది ఆత్మహత్య కాదని, ఒంటిపై గాట్లు ఉన్నాయని, ఇది ముమ్మాటికి హత్యేనని ఆరోపించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భవ్య, వైష్ణవి న్యాయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు మహిళా, ప్రజా, బహుజన సంఘాల నేతలు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూపరాణి, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మిదేవి మాట్లాడుతూ.. గతంలో ఉన్నత వర్గాల చెందిన ఓ యువతి చనిపోతే నలుగురు అమాయకులను కాల్చి చంపారని గుర్తుచేశారు. కానీ, బడుగు, బలహీనవర్గాల ఆడపిల్లలు చనిపోతే ఎలాంటి చర్యలు తీసుకోకపోగా నిందితులను సామాజికవర్గం ఆధారంగా కాపాడుతున్నారని ఆరోపించారు. బహుజన సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు కే యాదవ్ మాట్లాడుతూ.. భవ్య, వైష్ణవి ఆత్మహత్య చేసుకున్నారని చెప్తున్న గదికి మహిళా, ప్రజా సంఘాల నాయకులతో కలిసి నిజనిర్ధారణ కమిటీగా వెళ్లి పరిశీలించామని, అధికారులు చెప్పేదానికి అక్కడ ఉన్న పరిస్థితులకు పొంత లేదని పేర్కొన్నారు. హాస్టల్ వార్డెన్ మందలించడం వల్లే ఆత్మహత్య చేసుకున్నారని కట్టుకథ చెప్తున్నారని, ఎవరైనా మందలిస్తే ఒకే సారి ఇద్దరు ఆత్మహత్య చేసుకుంటారా? అని ప్రశ్నించారు.

ఆ కుటుంబానికి కనీసం ధైర్యం కల్పించారా?

రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని తెలంగాణ యాదవ సంక్షేమ సంఘం నాయకులు మధుయాదవ్ మండిపడ్డారు. ఇద్దరు ఆడపిల్లలు చనిపోయి 15 రోజులు గడుస్తున్నా సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం, కనీసం ఆ కుటుంబానికి ధైర్యం కల్పించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. తెలంగాణ బీసీ జన సభ నేత, అఖిల భారత యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. ఇద్దరు పిల్లల మరణం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని, తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. భవ్య తండ్రి కృష్ణ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ తరచూ అమ్మాయి గదుల్లోకి వస్తున్నాడని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు చెప్పిందని గుర్తు చేశారు. వైష్ణవి తండ్రి నాగరాజు మాట్లాడుతూ.. తన బిడ్డ ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీపీఎస్ కన్వీనర్ రాంబాబు, తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దార మధు, తెలంగాణ జర్నలిస్టు ఫోరం ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, చామకూర రాజు, డీకే చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హన్మాపురం సబ్‌స్టేషన్‌లో మంటలు

- రూ.5 కోట్ల మేర ఆస్తి నష్టం

హన్మాపురం సబ్‌స్టేషన్‌లో ఎగిసిపడుతున్న మంటలు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 18 : భువనగిరి మండలం హన్మాపురంలోని 220 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో శనివారం అర్ధరాత్రి సంభవించిన షార్ట్ సర్క్యూట్‌తో పెద్ద ప్రమాదం జరిగింది. విధుల్లో ఉన్న సిబ్బంది సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆలేరు, భువనగిరి అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి, డీఈ దంతూరి మల్లికార్జున్‌గౌడ్ ఆదివారం ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. పలు విద్యుత్ పరికరాలు దగ్ధమయ్యాయని, రూ.5 కోట్ల మేర ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. వెంటనే రంగంలోకి దిగిన విద్యుత్తు సిబ్బంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. మరోవైపు సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపడుతున్నారు.

ఆరోగ్యశాఖకు లంచాల జబ్బు!

- ఒక్కో లెటర్‌కు రూ.5-30 వేల వరకు
- వైద్య ఆరోగ్యశాఖపై ఏసీబీ ఫుల్ ఫోకస్
- 'నల్లగొండ ఘటనతో ఫిర్యాదుల వెల్లువ
- డబ్బు లిస్తేనే డిప్యూటేషన్.. రిలీవ్ లెటర్
- వైరల్ అవుతున్న ఆడియోతో కలకలం



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్యశాఖను లంచాల రోగం వేధిస్తున్నది. ప్రతి పనికీ అన్ని స్థాయిల్లో డబ్బు జబ్బు పెరిగిపోయింది. ప్రతి వ్యవహారంలో లంచం ఇవ్వనిదే ఫైల్ కదలని దుస్థితి తలెత్తింది. నల్లగొండ జిల్లాలో దవాఖాన సూపరింటెండెంట్ ఏకంగా రూ.3 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం అందులో భాగమే. దీనికితోడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ ఆడియో మరింత సంచలనంగా మారింది. ఏకంగా ఉన్నతాధికారికే డిప్యూటేషన్ కోసం లంచం ఇచ్చానని, రిలీవింగ్ ఆర్డర్‌కే వేలకు వేలు ముట్టజెప్పాల్సి వస్తున్నదని ఆ ఆడియోలో ఉన్నది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య శాఖపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టిసారించినట్టు తెలిసింది. నల్లగొండ ఘటన తర్వాత ఏసీబీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయని తెలిసింది. ముఖ్యంగా హైదరాబాద్ కోఠిలోని ప్రధాన కార్యాలయ అధికారులపై ఫిర్యాదులు అందినట్టు సమాచారం. డీఎంహెచ్‌వోలు, మెడికల్ కాలేజీలకు అనుసంధానంగా ఉన్న సూపరింటెండెంట్లపై ఏసీబీ ఫోకస్ పెట్టినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. డిప్యూటేషన్ కోసం సూపరింటెండెంట్లు, డాక్టర్లు, నర్సులు ఎంత ముట్టజెప్పాలో హైదరాబాద్‌లో ఫిక్స్ చేసినట్టు చెప్పుకుంటున్నారు. ఆ మేరకు ముట్టజెప్పి డిప్యూటేషన్ ఆర్డర్ తీసుకొచ్చినా.. పనిచేస్తున్న ప్రాంతం నుంచి రిలీవింగ్ లెటర్లు తీసుకోవడానికి మళ్లీ చేతులు తడపాల్సి వస్తున్నదని తెలిసింది. ఒక్కో లెటర్‌కు రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు వసూ